సాక్షి సూర్యాపేట

ఆదివారం । 1 । జనవరి । 2023



యాదాద్రిలో స్విట్జర్లాండ్ యువతి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని స్విట్జర్లాండ్‌కు చెందిన యువతి శనివారం దర్శించుకున్నారు.

- 10లో



కన్నపేగును వద్దనుకుని..

కన్నపేగును వద్దనుకుని ఖమ్మం పెద్దాస్పత్రిలోని ఊయలలో వేసి వెళ్లిపోయారు ఆ తల్లిదండ్రులు.

- 10లో

గరిష్టం/కనిష్టం 31.0°/20.0°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి మోస్తరుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పనులు త్వరగా పూర్తి చేయాలి



గదిలో బండలు వేసే పనులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

తిరుమలగిరి (తుంగతుర్తి) : మౌలిక వసతుల కల్పన కోసం పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని డీఈఓ కె.అశోక్ అన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీ లోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి : జిల్లాకు గోదావరి జలాలను శనివారం తాత్కాలికంగా నిలిపివేశారు. కరీంనగర్ సమీపంలో ఎస్సారెస్పీ కాల్వకు గండిపడే అవకాశం ఉండడంతో మరమ్మతుల నిమిత్తం తాత్కాలికంగా రెండో దశకు ఎల్‌ఎండీ నుంచి నీటిని నిలిపివేసినట్టు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం 700 క్యూసెక్కులు వదిలినప్పటికీ అవి కూడా పూర్తిగా నిలిపివేశారు. మరో మూడు రోజుల్లో నీటి పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

చివ్వెంల (సూర్యాపేట) : నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్‌కు మండలంలోని జి.తిర్మలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థినులు స్రవంతి, కీర్తన ఎంపికయ్యారు. సూర్యాపేటలో శనివారం నిర్వహించిన అండర్–14, అండర్–16 విభాగం 600 మీటర్ల పరుగు పందెంలో రాణించడంతో ఎంపికైనట్టు పాఠశాల సిబ్బంది తెలిపారు. వీరు ఈ నెల 12, 13, 14 తేదీల్లో బిహార్ రాష్ట్రం పాట్నాలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్ రూరల్ : సీజనల్ వ్యాధులతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ సాహితి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్ అన్నారు. శనివారం మండలంలోని అమరవరంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా శుభ్రమైన తాగునీరు తాగుతూ, వేడి ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి గుంతలను పూడ్చి వేయడం ద్వారా దోమలను అరికట్టవచ్చని తెలిపారు. అంతేకాకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, సబ్ యూనిట్ అధికారులు శ్రీనివాసరాజు, అంజయ్య, మండల ఆరోగ్య విస్తరణ అధికారి ప్రభాకర్, రామకృష్ణ, శ్రీనివాస్, విజయ, వరలక్ష్మీ, అలివేలు మంగ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

• హ్యాపీ న్యూ ఇయర్

ఈ ఏడాదంతా మంచి జరగాలని కోరుకుంటూ జిల్లా ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. జిల్లా అంతటా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత యువతీయువకులు కేరింతల నడుమ కేక్‌లు కట్ చేసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకొని సందడి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



జిల్లాకేంద్రంలోని జయ స్కూల్‌లో 2023 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



సూర్యాపేటలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు

ఈ ఏడాదే పవర్ ప్లాంట్



- పనులు వేగవంతం చేస్తాం
- ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు
- ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
- 'సాక్షి'తో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: కొత్త సంవత్సరంలో యాదాద్రి అల్ట్రా మెగా పవర్‌ప్లాంట్ మొదటి దశను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 2023 కొత్త సంవత్సరంలో అదే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. పవర్‌ప్లాంట్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న పనులను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. ప్రాజెక్టును అడ్డుకునే కుట్రలను అధిగమించి రెండు మూడు దశల పనులను కూడా రెట్టించిన వేగంతో ముందుకు తీసుకెళ్తామని వివరించారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, వాటిని మరింత వేగవంతం చేస్తామన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు మెడికల్ కాలేజీలు ఇచ్చారని, నల్లగొండలో మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. ఉమ్మడి జిల్లాలో గతంలో ఎన్నడూ చేయలేనంతగా అభివృద్ధి పనులను చేపట్టామని, వాటిని 2023 సంవత్సరంలో పూర్తి చేసేలా చేస్తామన్నారు. యావత్ తెలంగాణ సమాజం సుభిక్షంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల ఆకాంక్షలకు తగిన ప్రణాళికలు రూపొందించి సుభిక్షమైన పాలనను అందించి కొత్త ఒరవడిని సష్టించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. అదే ఒరవడితో నూతన సంవత్సరంలోనూ సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. ముందుగా ఆయన ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు నూతన సంవత్సరంలో తీసుకోబోయే నిర్ణయాలు వారి అభ్యున్నతికి దోహదపడలని ఆకాంక్షించారు.

'నూతన' ఒరవడితో ముందుకు సాగుతాం

• కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కొత్త సంవత్సరంలో ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా నూతన ఒరవడితో ముందుకు సాగుతామని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. కొత్త సంవత్సంలో జిల్లాలో నూతన సమీకృత కలెక్టరేట్ అందుబాటులోకి రానుడటంతో అన్ని శాఖలు ఒకే భవనంలోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు పాలన మరింత చేరువ కానుంది. జిల్లాలో అధికంగా భూ సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. గ్రామ పంచాయతీలను స్వచ్ఛత గ్రామాలుగా రూపుదిద్దుటకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టనున్నాం. విద్యా, వైద్యరంగాల్లో సేవలను ప్రజలకు మరింత చేరువ చేయనున్నాం. ఫిబ్రవరిలో జరుగనున్న చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరను ఒక సవాల్‌గా తీసుకొని విజయవంతంగా నిర్వహిస్తాం. ఇక పరిపాలన విభాగంలో సమగ్ర మార్పులు తీసుకొచ్చి ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండేలా చేస్తాం.. ప్రజలంతా అధికారులకు సహకరించి జిల్లా అభివృద్ధికి పాటుపడాలి. నూతన సంవత్సరంలో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించి సుఖ సంతోషాలతో గడపాలి.

ప్రజలకు మరింత చేరువగా సేవలు

• ఎస్పీ రాజేంద్ర ప్రసాద్



సూర్యాపేట క్రైం : రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలను నియంత్రించే చర్యలపై జిల్లా ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తూ.. 2023 సంవత్సరంలో పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 2022లో మరింత సక్సెస్ అయ్యామని.. 2023లో కూడా ఇదే జోష్‌తో ముందుకెళ్తామని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు మోసపోకుండా ఉండేందుకు ఇప్పటి నుంచే సైబర్ నేరాలపై ఎలా అప్రమత్తంగా ఉండాలో.. అన్నదానిపై సిబ్బందిచేత అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. అంతే కాకుండా మహిళల రక్షణకు పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వకమైన పోలీసు విధానాన్ని కొనసాగిస్తానని పేర్కొన్నారు. ప్రజా భద్రతే ధ్యేయంగా టీమ్ వర్క్ చేస్తామన్నారు. 100 డయల్‌పై కూడా ప్రజలను మరింత చైతన్యపరుతస్తామన్నా రు. ముఖ్యంగా జిల్లాలో గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకుంటామన్నారు. పదేపదే పీడీఎస్ బియ్యం, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. పౌరులు చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలపై అవగాహన కల్పిస్తాం

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌతం ప్రసాద్



గౌతం ప్రసాద్

చివ్వెంల : కొత్త సంవత్సరంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శనివారం 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వెల్లడించిన పలు విషయాలు ఆయన మాటాల్లోనే.. నూతన సంవత్సరం వేడుకలను ప్రజలకు సంతోషంగా జరుపుకోవాలి. చిన్న చిన్న ఘర్షణలతో పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లి కోర్టు మెట్లు ఎక్కొద్దు. దీనివల్ల సమయం వృథా కావడంతోపాటు, ఆర్థికంగా తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుంది. గ్రామాల్లోనే పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుని సమస్యలు పరిష్కరించుకోవాలి. కోర్టులకు వచ్చే కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూస్తాం. ఈ ఏడాది జిల్లా న్యాయ సేవా సమితిని ఏర్పాటు చేయబోతున్నాం. దీని ద్వారా ప్రజలకు న్యాయ సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు, పేదరికంలో ఉండి అడ్వకేట్‌ను పెట్టుకోలేని వారికి న్యాయ సహాయం అందేలా చూస్తాం. న్యాయ సేవాధికార సమితి ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా ఉండాలి. దానివల్ల సమాజంలో చెడ్డ పేరుతో పాటు, చట్టపరమైన శిక్షలకు గురవుతారు. నేరాలకు, ఘర్షణకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ప్రజలు నూతన సంవత్సరంలో ఆనందంగా ఉండాలి.

మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలి



కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించి, మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర నేత బాణాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేసిందన్నారు. కేంద్రం ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, రైతులను విస్మరించిందన్నారు. రైతుల రుణాలన్నీ మాఫీ చేసి, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అరవై ఏళ్లు నిండిన రైతులందరికీ నెలకు రూ.5.వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి అందజేశారు. ఈ ధర్నాలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేత మట్టపల్లి అంజయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, రైతు సంఘం నాయకులు వీరయ్య, వీరబాబు, శంబయ్య, లక్ష్మణ్, వెంకన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక సిద్ధం చేయాలి

నాగారం : మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై రోడ్డు నిర్మాణానికి అయ్యే వ్యయ ప్రణాళిక సిద్ధం చేసి నివేదిక అందించాలని జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీరు రమేష్ బాబు అధికారులను ఆదేశించారు. శనివారం నాగారం పెద్ద చెరువు కట్టను జిల్లా నీరుపాదల శాఖ ఎస్‌ఈఈ నాగేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాకపోకలు సాగించడానికి రైతుల సౌకర్యార్థం పెద్ద చెరువు కట్టపై రహదారి నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. చెరువు కట్ట నుంచి నీటి లీకేజీలు లేకుండా కట్టను పునరుద్ధరించడంతో పాటు, రోడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చును అంచనా వేసి నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటిపారుదల శాఖ ఈఈ కె.విజయ్‌కుమార్, డీఈఈ పిచ్చయ్య, ఏఈఈ హరిస్వరూప్, సస్థానిక నాయకులు గుండగాని అంబయ్య గౌడ్, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తాం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ రాజ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాలపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్యం, పచ్చదనం, చెత్త సేకరణ, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు ,క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు వంటి వాటిపై గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ జట్టు కెప్టెన్‌గా కృష్ణవేణి



కృష్ణవేణిని అభినందిస్తున్న జగదీశ్‌యాదవ్

మేళ్లచెరువు : తమిళనాడు రాష్ట్రం మధురై పట్టణంలో ఆదివారం నుంచి జరగనున్న జాతీయ జూనియర్ ఫెడరేషన్ కప్ కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన పసుపులేటి కృష్ణవేణి ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి నామా నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు సహకరించిన జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రి జగదీశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జగదీశ్‌యాదవ్, అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, అసోసియేషన్ సభ్యులకు నర్సింహారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త వేరియంట్‌ను ఎదుర్కొనేలా..

- మళ్లీ.. కోవిడ్ సేవలు అందించేందుకు వైద్యారోగ్యశాఖ రెడీ
- అన్ని ఆస్పత్రుల్లో సిద్ధంగా ఐసోలేషన్ పడకలు
- అందుబాటులో 102 మంది డాక్టర్లు



తిరుమలగిరి పీహెచ్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

నాగారం : విదేశాల్లో కోవిడ్ కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు నాలుగో దశ కోవిడ్ (కొత్త వేరియంట్ – బీఎఫ్ 7) ముప్పు పొంచి ఉందనే సంకేతాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఇందులో భాగంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు ఇటీవల జిల్లా వైద్యాధికారి, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఇతర డాక్టర్లతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో వ్యాక్సినేషన్ పరిస్థితి, ఆక్సిజన్ బెడ్లు, ఆక్సిజన్ ప్లాంట్లు, ప్రత్యేక చికిత్స కేంద్రాలు తదితర వివరాలను సేకరించారు. కోవిడ్ నిబంధనలు పాటించాలని, అర్హులందరికీ ప్రికాషన్ డోసు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో జిల్లా అధికారులు ఈ నెల 27న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆస్పత్రుల్లోని అన్ని విభా గాలను అప్రమత్తం చేసి సదుపాయాలపై ఆరా తీశారు. ఒకటి, రెండో విడతల్లో లాగే బాధితులకు కోవిడ్ సేవలను అందించడానికి సిద్ధమయ్యారు.

జిల్లాలో ఇలా..

ఆస్పత్రులు	112
ఐసోలేషన్ పడకలు	156
ఆక్సిజన్ సిలిండర్లు	119
ఐసీయూ పడకలు	80
వెంటిలేటర్లు	13

అందుబాటులో ఆక్సిజన్..

కోవిడ్ వచ్చిన వారిలో తీవ్రమైన లక్షణాలు ఉంటే ఆస్పత్రిలో చేర్చుతారు. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటే వెంటిలేటరు సదుపాయంతో చికిత్స అందిస్తారు. ఆక్సిజన్ అందించడానికి ఆక్సిజన్‌ను స్టోర్ చేసే ట్యాంక్‌తో పాటు ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే రెండు యంత్రాలు జిల్లాలో ఉన్నాయి. 119 ఆక్సిజన్ సిలిండర్లు, 80 ఆక్సిజన్ పడకలు, 13 వెంటిలేటర్లను అందుబాటులో ఉంచారు.

సిద్ధంగా ఉన్నాం..



జిల్లాలో కోవిడ్ రోగులకు వైద్యసేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొర త లేకుండా చర్యలు చేపట్టాం. ఒకవేళ కోవిడ్ ముప్పు వచ్చినా అధిగమించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. వసతులపై నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి అందజేశాం.

– డాక్టర్ కోటాచలం, డీఎంహెచ్‌ఓ, సూర్యాపేట

ఏర్పాట్లు ఇలా..

రెండో దశలో కోవిడ్ కేసుల తీవ్రత, పడకల కొరతతో అనేక మంది ఇబ్బందులు పడ్డారు. ఆక్సిజన్ అందక చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సమస్యను అధిగమించేందుకు జిల్లాలోని 112 ఆస్పత్రుల్లో 156 ఐసోలేషన్ పడకడలను కోవిడ్ రోగుల కోసం సిద్ధంగా ఉంచారు. అలాగే వైద్య సేవలు అందించేందుకు 102 డాక్టర్లు, 90 మంది హెల్త్‌సిబ్బంది, 392 మంది పారామెడికల్ సిబ్బంది, 16 ఆయుష్, 3,856 ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలను సిద్ధం చేశారు. అలాగే జిల్లాలో వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ పరీక్షల నిమిత్తం ప్రస్తుతం 2,400 పీఈపీ కిట్లు, 4000 ఎన్–95 మాస్కులు అందుబాటులో ఉంచారు. బాధితులకు సేవలు అందిస్తూనే అర్హులకు బూస్టర్ డోస్ ఇచ్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సిద్ధంగా ఉంది.

నర్సరీల పరిశీలన



మఠంపల్లి నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ పెంటయ్య

మఠంపల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను వచ్చే ఏప్రిల్ నాటికి ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ డాక్టర్ పెంటయ్య సూచించారు. శనివారం మండలంలోని మఠంపల్లి, చౌటపల్లి, అల్లీపురం తదితర గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట సర్పంచులు జోజి, కృష్ణవేణి, ఏపీఓ ఉమ, టీఏలు ఉన్నారు.

భీంరెడ్డి నర్సింహారెడ్డి శతజయంతి వేడుకలు



బీఎన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎన్ స్మారక కమిటీ సభ్యులు

నాగారం: మండల పరిధిలోని ఫణిగిరిలో భీంరెడ్డి నర్సింహారెడ్డి శతజయంతి వేడుకలను శనివారం బీఎన్ స్మారక కమిటీ, ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ చిత్రపటానికి బీఎన్ స్మారక కమిటీ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి భూమి కోసం, భుక్తికోసం పోరాటం చేశారని అన్నారు. శ్రీరాంసాగర్ కాలువకు బీఎన్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫణిగిరిలో బీఎన్‌తో కలిసి పనిచేసిన వారిని శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే బీఎన్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్టు నర్సింహారావు, పత్తేపురం యాదగిరి, బుక్కరాజు తిరుపతి, ఎంసీపీఐయూ తుంగతుర్తి డివిజన్ ఇన్‌చార్జ్ ఈదుల వీరపాపయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజంతోనే సమసమాజ స్థాపన

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



లక్ష్మీనర్సయ్య సంతాప సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి: కమ్యూనిజంతోనే సమసమాజ స్థాపన సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కీతవారిగూడెంలో సీపీఎం సీనియర్ నాయకుడు గుడెపు లక్ష్మీనర్సయ్య సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎర్ర జెండాతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మిన వ్యక్తి లక్ష్మీనర్సయ్య అని అన్నారు. అంతకుముందు లక్ష్మీనర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని అప్పన్నపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న యడవెల్లి కోటిరెడ్డి, జాన్‌రెడ్డిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాకుబ్, పారేపల్లి శేఖర్‌రావు, తుమ్మల సైదయ్య, జుట్టుకొండ వెంకటేశ్వర్లు, సర్పంచ్ జ్యోతి రామారావు, ఎంపీటీసీ చాంద్‌మియా, నర్సయ్య, వెంకటేశ్వర్లు, వెంకయ్య, మట్టయ్య, వెంకటాచారి, శ్రీనివాస్, రామస్వామి, శ్రీను తదితరులున్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

● 577మంది ఎంపిక

నల్లగొండ క్రైం: పోలీసు ఉద్యోగాల భర్తీలో భాగంగా నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులు 577మంది ఈవెంట్స్‌లో ఎంపికయ్యారు. మొత్తం 1374మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1193మంది హాజరైనట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈవెంట్స్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్య కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఈవెంట్స్‌ను స్పెషల్ ఎస్పీ శబరీష్ పర్యవేక్షించారు.

కలెక్టరేట్‌లో న్యూఇయర్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సూర్యాపేట కలెక్టరేట్‌లో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు తన చాంబర్‌లో కేక్ కట్ చేసి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శ్రీదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీ ఉత్తమ్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్: మండల కేంద్రంలోని కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం హుజూర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏడాదిలో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కల్వరి టెంపుల్ వ్యవస్థాపకుడు డాక్టర్ పి. సతీష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు అజీజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి నిదర్శనం 'గంగెద్దు'

● సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్



గంగెద్దు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న జూలూరి గౌరీశంకర్ తదితరులు

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు శీలం భద్రయ్య రాసిన గంగెద్దు కథా సంపుటి తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బుక్ ఫెయిర్‌లో జూలూరి గౌరీశంకర్ ఈ కథా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రజల జీవితాన్ని అనేక కోణాల్లో చూపించిన గంగెద్దు వంటి కథా సంపుటిలు ఇంకా రావాల్సిన అవసరం ఉందన్నారు. 'లొట్టపీసుపూలు' కథలతో తెలుగు సాహిత్యంలో అడుగుపెట్టిన శీలం భద్రయ్య గంగెద్దు కథా సంపుటిని ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎస్. రఘు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాసులు, తంగేడు పత్రిక సహ సంపాదకుడు కాంచనపల్లి గోవర్ధనరాజు, తెలంగాణ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీదేవి, పరిశోధకుడు వెల్దండి శ్రీధర్, సాహితీవేత్తలు వేముల యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బొగ్గు లారీలో మంటలు

నకిరేకల్: సీజ్ అయిన బొగ్గు లారీని అటవీశాఖకు సంబంధించిన నర్సరీకి తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు అంటుకున్నాయి. ఈ సంఘటన నకిరేకల్ మండలంలోని నెల్లిబండ శివారులో శనివారం చోటుచేసుకుంది. నకిరేకల్ ఫైర్ స్టేషన్ ఎస్ఐ భీముడు తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల క్రితం కేతేపల్లి మండలం శివారులో అనుమతి లేకుండా బొగ్గును తరలిస్తున్న లారీని అటవీశాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. బొగ్గు లోడుతో ఉన్న ఆ లారీని శనివారం మధ్యాహ్నం నెల్లిబండ శివారులోని ఫారెస్టు నర్సరీకి తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి లారీలోని బొగ్గుకు మంటలు అంటుకున్నాయి. లారీ డ్రైవర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందివ్వడంతో వచ్చి మంటలు ఆర్పారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

భువనగిరి: భువనగిరి పెద్దచెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన పాలమాకుల యాదగిరి అలియాస్ స్వామి(20) గురువారం పెద్దచెరువులో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, పోలీసు సిబ్బంది చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం రెండుగంటల పాటు శ్రమించి చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై కృష్ణ తెలిపారు.

మహిళ అదృశ్యం



నర్ర అనిత

రామన్నపేట: మండలంలోని సర్నేనిగూడెం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు శనివారం ఫిర్యాదు అందిందని రామన్నపేట ఎస్ఐ ఎం. లక్ష్మయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సర్నేనిగూడెం గ్రామానికి చెందిన నర్ర అనిత (42) డిసెంబర్ 28న దెబ్బతగిలిన తన చేతికి వైద్యం చేయించుకుంటానని చెప్పి రామన్నపేటకు వెళ్లింది. సాయంత్రం అయినా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లలో వెతికారు. ఎంత వెతికినా అనిత ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త సాలయ్య శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.